భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL
29, అక్టోబర్ 2026, గురువారం
భారత్ సమాచార్

# నీటి కష్టాలు రాకముందే అలర్ట్.. చెరువు నీటిని కాపాడిన సర్పంచ్



**భారత్ సమాచార్, మహబూబాబాద్ జిల్లా**: ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో నీటి సంరక్షణకు శ్రీరామగిరి గ్రామ సర్పంచ్ మాదరి ప్రశాంత్ ముందడుగు వేశారు. గతంలో కురిసిన వర్షాలకు చెరువులో చేరిన నీరు వృథాగా బయటకు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. చెరువు మత్తడి వద్ద ఉన్న రంధ్రాల ద్వారా నీరు వృథాగా పోతున్నట్లు గుర్తించి, గ్రామస్తులతో కలిసి వాటిని పూడ్చివేయించారు. నీటి విలువను గుర్తించి సర్పంచ్ తీసుకున్న ముందస్తు చర్యలపై గ్రామస్తులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామంలోని చెరువును సర్పంచ్ మాదరి ప్రశాంత్ సందర్శించారు. ఈ క్రమంలో మత్తడి రంధ్రాల నుంచి నీరు బయటకు పోతున్నట్లు గుర్తించారు. ఆలస్యం చేయకుండా గురువారం గ్రామస్తులతో కలిసి చెరువు మత్తడి వద్దకు చేరుకుని, స్వయంగా చెరువులోకి దిగి రంధ్రాలను పూడ్చే పనులను ప్రారంభించారు. అవసరమైన చోట పెద్ద రంధ్రాలను పూడ్చేందుకు JCB యంత్రాన్ని కూడా వినియోగించారు. గ్రామస్తుల సహకారంతో నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు చేపట్టారు.



## సర్పంచ్ ముందుచూపుతో నీటి వృథాకు చెక్!

రాబోయే రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని చెరువులో నిల్వ ఉన్న నీటిని కాపాడుకోవడంపై సర్పంచ్ ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామ ప్రజలు, రైతులతో పాటు పశువులు, పక్షులకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలన్న ఆలోచనతో ఈ పనులు చేపట్టారు. ఉపసర్పంచ్ రామగిరి సుమన్, వార్డు సభ్యులు, గ్రామస్తులు కలిసి శ్రమించి చెరువు నీరు వృథాగా బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు.

## నీటిని కాపాడుకోవడం అందరి బాధ్యత



ఈ సందర్భంగా సర్పంచ్ మాదరి ప్రశాంత్ మాట్లాడుతూ, నీటిని పొదుపుగా వినియోగించుకోవడం, అందుబాటులో ఉన్న నీటి వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. చెరువుల్లో నీరు నిల్వ ఉంటే భూగర్భ జలాలు తగ్గిపోకుండా కొంతవరకు తోడ్పడుతుందని, తద్వారా ప్రజలు, రైతులు, పశువులు, పక్షులకు నీటి కొరత నుంచి ఉపశమనం లభిస్తుందని చెప్పారు.

నీరు లేకుండా ఏ ప్రాణికీ మనుగడ లేదని, ఈసారి ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామాల్లో ఎక్కడైనా నీరు వృథాగా పోతుంటే అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, నీటిని అవసరానికి తగినంత మాత్రమే వినియోగిస్తూ సంరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

చెరువులో నిల్వ ఉన్న నీటిని కాపాడేందుకు సర్పంచ్ స్వయంగా ముందుకు రావడం, గ్రామస్తులను భాగస్వాములను చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచేలా ఈ చర్య నిలుస్తోందని గ్రామస్తులు అభినందిస్తున్నారు.